

నేడు, రేపు ఓటర్ల జాబితాపై ప్రత్యేక కార్యక్రమం

డిఆర్ఒ విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫొటోఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 23, 24 తేదీల్లో శని, ఆదివారాల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు ఆదేశించారు. అర్హులైన వారు 6, 7, 8 దరఖాస్తు ఫారంలను పూర్తి చేసి ఇచ్చిన వాటిని స్వీకరించాలన్నారు. ఓటర్ల నమోదు అధికారులు, తహశీల్దార్లు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి సజావుగా శిబిరం నడుస్తుందో లేదో పరిశీలించాలని ఆదేశించారు. బిఎల్ఒలు స్వీకరించిన ఫారం 6, 7, 8 దరఖాస్తుల నివేదికను అదేరోజు సాయంత్రం ఐదు గంటలకు సంబంధిత తహశీల్దార్లు సమర్పించాలని తెలిపారు.

అందరి దృష్టి ఎంఎల్‌సి పోరుపైనే..!



ఉపాధ్యాయ ఎంఎల్‌సి బరిలో ఉన్న ఐదుగురు అభ్యర్థులు

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ
ఎంఎల్‌సి బరిలో నిలిచిన ఐదుగురు అభ్యర్థులు
ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం
పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా గోపీమూర్తి సుడిగాలి పర్యటన
డిసెంబర్ 5వ తేదీన ఎన్నికల పోలింగ్, 9న ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి - భీమవరం


ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలపై అందరి దృష్టి పడింది. ఇప్పటికే గెలుపోవటములపై సార్వత్రా చర్చ సాగుతోంది. ఎంఎల్‌సి అభ్యర్థులు కూడా గెలుపు తమదేనంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న అందరి ఉపాధ్యాయులనూ కలుసుకుంటూ ఓట్లు అభ్యర్థిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ నెల 11న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. 11వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ నామినేషన్ల ప్రక్రియ సాగింది. 19 నుంచి 21వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంహరణ జరిగింది. ఉపఎన్నికల్లో కీలకమైన నామపత్రాలు ఉపసంహరణ ఘట్టం గురువారంతో ముగిసింది. అయితే నామినేషన్ల ఉపసంహరణ అనంతరం బరిలో ఐదుగురు అభ్యర్థులు నిలిచారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా బొర్రా గోపీమూర్తి (భీమవరం), గంధం నారాయణరావు (ద్రాక్షారామం), నామన వెంకటలక్ష్మి (సామర్లకోట), కవల నాగేశ్వరరావు (రాజమహేంద్రవరం), పులుగు దీపక్ (తాడేపల్లిగూడెం) బరిలో నిలిచినట్లు ఎన్నికల అధికారులు ధ్రువీకరించారు. అయితే ఇప్పటివరకూ నాలుగు సార్లు ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి నియోజకవర్గ ఎన్నికలు జరిగాయి. తొలిసారిగా 2007లో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నల్లమిల్లి శేషారెడ్డి గెలుపొందారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల లాటరీ వేయడంతో ఆయనకు రెండేళ్లు మాత్రమే పదవీ కాలం దక్కింది. తిరిగి 2009లో జరిగిన ఎన్నికల్లో చైతన్యరాజు ఎన్నికయ్యారు. 2015లో జరిగిన ఎన్నికల్లో రాము సూర్యారావు, 2021లో షేక్‌సాబ్జీ ఎంఎల్‌సిలుగా ఎన్నికయ్యారు. 2023లో షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడంతో ప్రస్తుతం ఎన్నికలు అనివార్యమయ్యాయి. అయితే 2007 నుంచి జరిగిన ఎన్నికల్లో ప్రతిసారీ బరిలో 10 మంది వరకూ అభ్యర్థులు బరిలో ఉండేవారు. అయితే ప్రస్తుతం అయిదోసారి జరుగుతున్న ఈ ఎన్నికల్లో కేవలం ఐదుగురు మాత్రమే పోటీలో నిలిచారు. అయితే నియోజకవర్గం పరిధిలో కాకినాడ, బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలు, 113 మండలాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సుమారు 16,316 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. డిసెంబరు 5న బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించనున్నారు. 9వ తేదీన ఓట్లు లెక్కింపు చేయనున్నారు.

ఆప్యాయంగా పలకరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తూ..

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా సామాజికవేత్త, విద్యావేత్త బొర్రా గోపీమూర్తి బరిలో నిలిచారు. అందరి తలలో నాలుకలా ఉన్న గోపీమూర్తి అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి అందరినీ కలుపుకొని ప్రచారంలో దూసుకుపోతున్నారు. రాత్రీపగలూ తేడా లేకుండా తన ప్రచారాన్ని సాగిస్తున్నారు. ఉభయగోదావరి జిల్లాలో సుడిగాలి పర్యటన సాగిస్తున్నారు. దాదాపు 80 మండలాల్లో ఇప్పటికే ప్రచారాన్ని పూర్తిచేశారు. ఉపాధ్యాయ ఓటర్ల దగ్గరకు వెళ్లి ఓట్లు అభ్యర్థించడంలో తనకు తానే సాటిగా ముందుకెళ్తున్నారు. శాసనమండలిలో ప్రజా గొంతు నవుతానని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు, సామాన్య ప్రజానీకం సమస్యలు పరిష్కారం కావాలంటే పిడిఎఫ్ ఎంఎల్‌సిలతోనే సాధ్యమని చెబుతూ తనకు అవకాశం కల్పించాలంటూ తనదైన శైలిలో ప్రచారం సాగిస్తున్నారు. గోపీమూర్తి విద్యార్థి దశ నుంచే సమరశీల భావాలు కలిగిన వ్యక్తి. ప్రాథమిక విద్య అంతా ప్రభుత్వ పాఠశాలలోనే అభ్యసించారు. భీమవరం డిఎన్ఆర్‌లో ఇంటర్ మీడియట్, బిఎస్‌సి డిగ్రీ, ఏలూరు సిఆర్‌రెడ్డి కళాశాలలో బిఇడి పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంఎస్‌సి మ్యాథ్స్ పట్టా, నాగార్జున యూనివర్శిటీ నుంచి ఎంఎస్‌సి కెమెస్ట్రీ పట్టా. ఆంధ్రా యూనివర్సిటీ విశాఖపట్నం నుంచి ఎంఇడి పట్టా పొందారు. 1998లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. తర్వాత స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేశారు. అత్తిలి మండలం కొమ్మర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ 12 ఏళ్లపాటు సర్వీస్‌ను స్వచ్ఛందంగా వదులుకున్నారు. యుటిఎఫ్‌లో అనేక పదవులు చేపట్టిన గోపీమూర్తి ఉద్యమాల పట్ల అంకితభావంతో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తనదైన శైలిలో పోరాడి ఫలితాలు సాధించారు. ఎదుటివారికి సాయం చేయడంలో గోపీమూర్తి పాత్ర ప్రత్యేకమైంది.

గోపీమూర్తి గెలుపుపై యుటిఎఫ్, పిడిఎఫ్ ధీమా

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రధాన భూమిక పోషిస్తున్న యుటిఎఫ్, పిడిఎఫ్‌లు ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలోకి దిగిన షేక్ సాబ్జీ అఖండ విజయం సాధించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మొదటి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపులోనే విజయకేతనం ఎగురవేశారు. 2023 డిసెంబర్ 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో సాబ్జీ మృతి చెందారు. ఎంఎల్‌సి పదవీకాలం ఆరేళ్లు ఉండగా సాబ్జీ దాదాపు రెండున్న రేళ్లు మాత్రమే పదవిలో ఉన్నారు. ఇంకా దాదాపు మూడున్నరేళ్లు పదవీకాలం ఉండడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. అంతకు ముందు రాము సూర్యారావు పిడిఎఫ్ నుంచి గెలుపొందారు. ఈసారి జరగనున్న ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా గోపీమూర్తి బరిలో నిలిచారు. గెలిచిన అభ్యర్థి పదవీ కాలం 2027 మార్చి వరకూ మాత్రమే కొనసాగనుంది. అంతేకాకుండా ఉభయగోదావరి ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రతిసారీ పిడిఎఫ్ బలంగా పోటీ ఇవ్వడమే కాకుండా విజయం సాధిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో గోపీమూర్తి విజయం తథ్యమనే ప్రచారం జోరుగా సాగుతోంది.



ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రి సెల్వి

సేవల్లో అలసత్వం వహిస్తే సహించను


సర్వజన ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్ వెట్రి సెల్వి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

హాస్పటల్ సిబ్బంది ప్రజలకు సేవ చేసే విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి అన్నారు. ఏలూరులోని సర్వజన ప్రభుత్వాసుపత్రిని జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలోని అన్ని విభాగాలనూ సందర్శించారు. ఆయా విభాగాల్లో జరుగుతున్న పనుల తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఓపి, సదరన్, ఎక్సరే, డయాలసిస్, జనరల్ వార్డు, ఐసియు, ఫార్మసీ, పార్కింగ్ ఏరియాలో తదితర విభాగాల్లో తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చిన పేషంట్లను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్పటల్ సిబ్బంది వారితో ఎలా ప్రవర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. జనరల్ వార్డులో ఉన్న పేషంట్లను ఆరోగ్యం ఎలా ఉంది సిబ్బంది సక్రమంగా చూస్తున్నారా అని ప్రశ్నిస్తూ పేషంట్ల నుంచి సమాధానాలు తెలుసుకున్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారితో, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ సావిత్రి, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎంఎస్ రాజుతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌కు కావాల్సిన సదుపాయాలు ఏం కావాలో అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఎవరైనా సేవల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ ప్రతిరోజూ కలెక్టర్‌కు పంపించాలని తెలిపారు. పనిచేయకుండా మూలనపడి ఉన్న అంబులెన్స్‌ను బాగు చేయించి ఉపయోగపడేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సిబ్బంది కొరత తగ్గించడానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలో వాటిని తక్షణం అమలు చేయాలని హాస్పటల్ సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా ప్రయివేటు అంబులెన్స్ వారు విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తుండడంతో, వారికి సరైన ధరల పట్టిక ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. దోమల నివారణకు వారానికి రెండు సార్లు ఫాగింగ్ చేయాలని కార్పొరేషన్ సిబ్బందిని ఆదేశించారు. ఇకపై ఆసుపత్రిని ప్రతిసారీ సందర్శిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎం ఒ.దుర్గా కుమార్, డిసిహెచ్ఎస్ పాల్ సతీష్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సిఐటియు ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వాలంటీర్లు, సిఐటియు నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గ్రామ వార్డు సచివాలయాల పరిధిలోని వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఎపి గ్రామ వార్డు వాలంటీర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి వాలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రత్యక్షంగా లబ్ధిదారులకు అందిస్తూ సేవలందించారని తెలిపారు. వారికి గత ప్రభుత్వం రూ.5000 ఇచ్చిందని గుర్తు చేశారు. 2024 జూన్ నుంచి కొత్త ప్రభుత్వం వాలంటీర్లకు జీతాలు ఆపేసిందని, ఇది సరైన విధానం కాదని అన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం వాలంటీర్లను కొనసాగిస్తామని, వారి జీతం రూ.పది వేలకు పెంచుతామని స్పష్టమైన హామీ ఇచ్చిందని తెలిపారు. వాలంటీర్లకు ఆరు నెలల బకాయి జీతాలను తక్షణం విడుదల చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇచ్చిన హామీకి తగ్గట్టుగా జీతం పెంచాలని, వారిని విధుల్లో కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. లక్షల మంది యువతీ యువకులు సేవా భావంతో అతి తక్కువ జీతానికే వాలంటీర్లుగా చేరితే, వారి సేవలను సక్రమంగా ఉపయోగించుకోవాల్సింది పోయి వారికి ఒక పార్టీ ముద్ర వేసి వారిని విధుల నుంచి దూరంగా ఉంచడం సరైంది కాదన్నారు. వాలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని, లేదంటే వారందరినీ సంఘటితం చేసి రాబోయే కాలంలో ఉద్యమాలను ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్స్ యూనియన్ నాయకులు పృథ్వీరాజ్, విజయ్, తన్మయ, అశోక్, మణికంఠ, హర్షలత తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం డిఆర్ఒకి వినతిపత్రం అందజేశారు.

రబీ పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే భరించాలి

జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ భాషాకు వ్యకాస నేతల వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రబీ పంటల బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, బీమా ప్రీమియం పేరుతో రైతులపై భారం వేయొద్దని ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ భాషాకు ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రబీ పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం వల్ల సన్న, చిన్న కారు రైతులు, పేద, కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వ కాలంలో ఉచిత పంటల బీమా పథకం అమలు చేసి రాష్ట్ర ప్రభుత్వమే ప్రీమియం చెల్లించిందని గుర్తు చేశారు. అదే తరహాలో బీమా ప్రీమియం ప్రస్తుత రబీ పంట కాలంలో కూడా చెల్లించాలని కోరారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు కనీస ధర రాక నష్టపోతున్న తరుణంలో ప్రభుత్వం వారిని అన్ని విధాలా ఆదుకోవాల్సి ఉందన్నారు. ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు పంటల బీమా పథకం అప్పగించడం వల్ల బీమా ప్రీమియం పేరుతో కంపెనీలు లాభాలు గడిస్తున్నాయని, రైతులకు మాత్రం బీమా పరిహారాలు అందడం లేదని తెలిపారు. అందుకు సమగ్ర పంటల బీమా పథకాన్ని తీసుకొచ్చిన ప్రభుత్వమే ఇన్సూరెన్స్ కంపెనీ నడిపి బీమా పరిహారాలు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అన్ని పంటలకూ పంటల బీమా అమలు జరిగేలా సమగ్ర పంటల బీమా పథకం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. పెట్టుబడి పెట్టి నష్టపోతున్న కౌలు రైతులకే పంటల బీమా పరిహారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ భాషాకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం జిల్లా నాయకులు

పొగాకు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

చర్చా వేదికలో కలెక్టర్ కె.వెట్రి సెల్వి



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజావక్తి - ఏలూరు

పొగాకు పంటలో నియంత్రణ పాటించి లాభసాటి అయిన పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొగాకు ప్రత్యామ్నాయ పంటలపై రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విస్తరణలో మహిళా సంఘాలు ఆచరించాల్సిన సప్తసూత్రాలు తెలిపే గోడపత్రికను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పొగాకు మూలంగా కలిగే రుగ్మతలు, అనార్థాలు, దుష్ఫలితాలు దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్‌పామ్, అపరాలు, మొక్కజొన్న, ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం పొగాకు సాగు చేస్తున్న రైతు పొగాకుకు బదులుగా కనీసం ఒక ఎకరంలో ప్రత్యా మ్నాయ పంటలు వేసి చూడాలన్నారు. ఇతర రైతులు సాగు చేస్తున్న పంటల తీరును పరిశీలించేందుకు అవసరమైతే రైతులను ఆయా పంట క్షేత్రాలకు తీసుకువెళ్లి అవగాహన కల్పిస్తామన్నారు. భూసార పరీక్షలు నిర్వహించి ఏ పంటకు ఆ భూమి అనువైనదో శాస్త్రవేత్తల ద్వారా తెలియజేస్తామన్నారు. ఆయా పంటల సాగులో అనుమానాలను ఈ సదస్సు ద్వారా నివృత్తి చేస్తామన్నారు. జిల్లాలో డ్రాగన్ ఫ్రూట్ సాగు మంచి ఫలితాలనిస్తుందన్నారు. అదేవిధంగా ఆయిల్ పామ్, మొక్కజొన్నకు మంచి డిమాండ్ ఉందని, ఆయా పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహాలు కూడా అందుతున్నాయన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగు విషయంలో సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్లాలన్నారు. మైక్రో ఇరిగేషన్‌పై అవగాహన కూడా కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పొగాకుకు ప్రత్యామ్నాయంగా పంట సాగుకు బ్యాంకర్ల సహకారం ఎంతో అవసరమన్నారు. పారిశ్రామిక రంగానికి ఇస్తున్న విధంగా ప్రోత్సహకాలను వ్యవసాయ రంగానికి అందించాలని కోరారు.



డిఆర్ఒకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నేతలు

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మెడికల్ సేల్స్ అండ్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు బివి.సత్యనారాయణ మాట్లాడుతూ మందులపై జిఎస్‌టి ఎత్తివేయాలని, మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కు కనీస వేతనాలు అమలు చేయాలని, ఫార్మా రంగంలో కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్లతో ఢిల్లీలో యూనియన్ ఆధ్వర్యంలో మహాధర్నా జరిగినట్లు తెలిపారు. ఈ ధర్నాకు మద్దతుగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలియజేసి జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తున్నామని తెలియజేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులు కాలరాస్తోందని విమర్శించారు. మందులపై జిఎస్‌టి ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అవసరమైన అత్యవసర, నిత్యావసర మందుల ధరలు తగ్గించాలని ఆయన కోరారు. మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.కిషోర్, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు ఉమ, మహేష్, గౌతమ్ పాల్గొన్నారు.

ఆయుధ కర్మాగారం విషయంలో ఎంపీ ప్రకటన సరికాదు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆయుధ కర్మాగారం విషయంలో ఏలూరు ఎంపీ ప్రకటనను సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జీలుగుమిల్లి మండలంలోని వంకావారిగూడెంలో 1500 ఎకరాల విస్తీర్ణంలో రూ.రెండు వేల కోట్లతో నావిక విభాగానికి అవసరమైన ఆయుధాల పరిశ్రమను జనవరి, ఫిబ్రవరి నెలలో శంకు స్థాపన చేస్తామని ఎంపీ ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పరిశ్రమను అక్కడి ప్రజలంతా తమకు వద్దని ముక్తకంఠంతో కోరుతున్నారని తెలిపారు. ఆయుధ పరిశ్రమ నిర్మిం చడానికి ప్రజలు సహకరిస్తే భూమి పరిహారం, ఇల్లుకు ఇల్లు ప్యాకేజీ ఇస్తామని వీరు కోల్పోయిందంతా మీకు అందిస్తామని చెప్పడం నీటిపై రాతల వలే ఉందని పేర్కొన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టులో నిర్వాసితులైన రూ.లక్ష కుటుంబాల్లో కేవలం రూ.పది వేల కుటుం బాలకు కూడా పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించలేదని, వీరికి నేటికీ ప్యాకేజీ దక్కక, ఇళ్లు పూర్తికాక, పూరైన కాలనీల్లో మౌలిక వస తులు లేక, కాలనీల్లో నిర్వాసితులకు చేసుకునేందుకు పనులు, ఉపాధి లేక అల్లాడుతున్నారని తెలిపారు. జాతీయ ప్రాజెక్టులో ప్రభుత్వమే బాధ్యతపడుతున్న నిర్వాసితుల పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే ఆయుధ పరిశ్రమ నిర్వాసితులను పట్టించుకునేవారే ఉండరని పేర్కొన్నారు. 1/70, పీసా, అటవీహక్కులు తదితర చట్టాలు అమల వుతున్న ఈ ప్రాంతంలో జనం పలు మార్లు మా ఊళ్లో ఆయుధ పరి శ్రమ పెట్టవద్దని గ్రామ సభలో ఏకగ్రీవంగా తీర్మానించినా ఎంపీ ఈ విధంగా ప్రకటనలు చేయడం ఆయనకు తగదని తెలిపారు. మొం డిగా ఈ విషయంలో ముందుకు వెళ్తే భవిష్యత్తులో రాజ్యాం గపర మైన, న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలి పారు. ఈ పరిశ్రమను స్థాపిస్తే వంకావారిగూడెం పంచాయతీ లోని ఆరు గ్రామాల ప్రజలు నిరాశ్రాయులవుతారని తెలిపారు.

ఆటలతో మానసికోల్లాసం : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్


ఆటలు శారీర దారుఢ్యానికే కాకుండా మానసిక ఉల్లాసానికి కూడా ఎంతో దోహదపడతాయని, నిత్యం విధుల్లో ప్రయాసలను ఓర్చి విధులను నిర్వహిస్తున్న సిబ్బందికి ఇది ఆటవిడుపని జిల్లా ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీసు మైదానంలో జిల్లా స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ స్పోర్ట్స్ మీట్‌ను ఎస్‌పి లాంఛనంగా ప్రారంభించారు. స్పోర్ట్స్ మీట్‌లో ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్‌డివిజన్లతో పాటు ఎఆర్.విభాగానికి చెందిన ఒక జట్టు జిల్లావ్యాప్తంగా స్పోర్ట్స్‌మీట్‌కు హాజరయ్యారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, తదితర ఆటలను నిర్వహిస్తున్నారు. తొలుత ఆయన స్పోర్ట్స్ మీట్‌కు హాజరైన ఎఆర్ సిబ్బందితో గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సంవత్సరాంతంలో యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ పేరుతో స్పోర్ట్స్ మీట్‌ను ప్రతి ఏడాది పోలీస్ శాఖ నిర్వహిస్తుందని తెలిపారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఏలూరు జిల్లావ్యాప్తంగా ఉన్న సబ్ డివిజన్లతో పాటు ఎఆర్ విభాగం కూడా ఈ ఆటల పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ ఆటల పోటీలు శనివారంతో ముగియనున్నాయని తెలిపారు. ఆటల పోటీల్లో గెలిచిన అభ్యర్థులకు, టీమ్‌లకు ప్రత్యేక బహుమతులు ఉంటాయని చెప్పారు. సిబ్బందికి మానసిక వికాసం పెంచడమే లక్ష్యంగా ప్రత్యేకంగా కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి ఎన్.సూర్య చంద్రరావు, ఎఆర్‌డి ఎస్‌పి శ్రీహరి, ఎస్‌బిసిఐ మల్లేశ్వ రరావు, ఆదిప్రసాద్, ఒకటో పట్టణ సిఐ సత్యనా రాయణ, మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు, గణపవరం సిఐ సుభాష్, నూజివీడు సిఐ సత్య శ్రీనివాస్, జీలుగుమిల్లి సిఐ వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలి

అధికారులకు జెసి ధాత్రీరెడ్డి ఆదేశాలు
రైస్‌మిల్లుల్లో తనిఖీలు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా దళారులకు, మిల్లర్లకు సహకరించిన ధాన్యం కొనుగోలు కేంద్రం అవుట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని రేచర్లలో డిఎన్ఆర్ ట్రేడర్స్ మిల్లును, మల్లాయగూడెం శ్రీలక్ష్మీగణపతి రైస్ మిల్లును ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మల్లాయగూడెం రైస్‌మిల్లుకు జారీ చేసిన ట్రక్‌షీట్లకు లారీలు, రైస్‌మిల్లు వద్దకు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పోతునూరు సొసైటీ వద్దకు వెళ్లి, ట్రాక్‌షీట్లు జారీ చేసిన కంప్యూటర్ ఆపరేటర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ట్రక్కుషీట్ జారీ చేసిన లారీ వద్దకు వెళ్లగా దళారులకు మిల్లర్లకు సహాయం చేయడంతో, కంప్యూటర్ ఆపరేటర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీలో లోడ్ చేస్తున్న 213 ధాన్యం బస్తాలను స్వాధీనం చేసుకుని అవుట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, రైస్‌మిల్‌కు జరిమానా విధించాలని, సివిల్ సప్లై డిఎస్ఒ రాజుకు ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రతిరోజు ఆర్‌బికెలను సందర్శించాలని తహశీల్దార్‌కి ఆదేశాలు జారీ చేశారు. పోతునూరు ఆర్‌బికె పరిధిలో గోనెసంచులు లేకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడం లేదని, గోనెసంచులు కొరత ఉంటే, గోనెసంచుల కోసం వచ్చే రైతులకు ఏమని సమాధానం ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు గోనెసంచులపై పరిరక్షణ లేకుండా, అలసత్వం వహిస్తున్నారని, మీరు పట్టించుకోకపోతే నేరుగా నాకైనా చెప్పండని, తాను చూసుకుంటానని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికప్పుడుకు గోనె సంచులిస్తే, రైతులకు నాణ్యమైన గోనెసంచులు ఎలా ఇస్తారని, వారు ఎలా చూసుకుంటారన్నారు. పోతునూరు ఆర్‌బికెలో సొసైటీలో గోనెసంచులు కూడా లేకపోవడం, అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతలపూడి మండలంలో ధాన్యం కొనుగోలు గోనెసంచులు ఎన్ని అవసరమవుతాయో, నేరుగా తనకు తెలుపమని తహశీల్దార్ తెలిపారు. రైతుల వద్ద నుంచి 20 క్వింటాలు కొనుగోలు చేస్తే 15 క్వింటాల వరకు ట్రాక్ షీట్ ఇస్తున్నారని సమాచారం. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవాక దేవి, సివిల్ సప్లై డిఎం శ్రీలక్ష్మి, డిఎస్ఒ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.



రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న జెసి ధాత్రిరెడ్డి

పిడిఎఫ్ అభ్యర్థులకు గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం మద్దతు

ప్రజాశక్తి - దెందులూరు

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్ర గోపీమూర్తికి రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం మద్దతు తెలిపినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.రాంబాబు, నాదెండ్ల బాబ్జీ సంయుక్తంగా ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక గొంతును చట్ట సభలో వాడిగ, వేడిగ వినిపించేందుకు పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని పేర్కొన్నారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసు సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని ఎస్‌పి ప్రతాప్ సింగ్ కిషోర్ తెలిపారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం పోలీసు సంక్షేమ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్‌పి జిల్లాకు చెందిన పలువురు సిబ్బంది నుంచి ఫిర్యాదులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పోలీసు సంక్షేమ దివస్ రోజునే కాకుండా పోలీస్ సమస్యలు ఏ రోజు ఉన్నా నేరుగా తనకు తెలియజేస్తే వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

యుపిఎస్‌సి నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రాథమిక, తుది పరీక్షల కోసం ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ గొల్లపూడిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఆర్.నాగరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాకు చెందిన అర్హత గల వెనుకబడిన తరగతులు (బిసి), షెడ్యూల్ కులాలు (ఎస్‌సి), షెడ్యూల్ తెగలకు (ఎస్‌టి) చెందిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కు లిస్టులు, కుల ధృవీకరణ పత్రం, ఆధాయ ధృవీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ నెల 24వ తేదీ లోపు ఏలూరులోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికార కార్యాలయంలో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 27వ తేదీన స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని, అందులో ఎంపికైన వంద (బిసి 66 శాతం, ఎస్‌సి 20 శాతం, ఎస్‌టి 14 శాతం) మందికి రిజర్వేషన్ ప్రాతిపదికన ఉచిత శిక్షణ, హాస్టల్ వసతి, భోజన వసతి ఉంటుందన్నారు. వివరాలకు 7569184335 సంప్రదించాలని తెలిపారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కూటమి ప్రభుత్వంలో వైద్య ఆరోగ్యనికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పొలసానపల్లి గ్రామానికి చెందిన జాజుల వెంకటేశ్వరరావుకు రూ.30 వేలు, అన్నవరం గ్రామానికి చెందిన గుండుబోయిన వెంకటేశ్వరరావుకు రూ.32,100, దేవరగుంట గ్రామానికి చెందిన దుట్టా వరప్రసాద్‌కు రూ.30 వేలు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించినట్లు చెప్పారు.

26న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - లింగపాలెం

మండలంలోని గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 26వ తేదీ మంగళవారం మందలపు సుబ్బారావు, రత్న మాణిక్యమ్మ సౌజన్యంతో వారి జ్ఞాపకార్థం మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎల్‌వి.ప్రసాద్ బృందంచే నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు, ఆపరేషన్లు నిర్వహించనున్నారు.

జెట్టిగురునాధరావుకు నిరీక్షణరావు అభినందన

ప్రజాశక్తి - టి.నరసాపురం

వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జెట్టిగురునాధరావుకు ఆ పార్టీ రాష్ట్ర ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి కురసం నిరీక్షణరావు, యూత్ నాయకులు అభినందనలు తెలిపారు. జంగారెడ్డిగూడెంలో ఆయన గృహంలో కలిసిన వారు పూలబొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ అంశాలపై ఆయన తో చర్చించారు.

24న గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘ సమావేశం

ప్రజాశక్తి - కలిదిండి

ఈ నెల 24వ తేదీన గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం మండలంలోని పడమటిపాలెంలో సంఘ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బి.వెంకటరాజు తెలిపారు. 2024 - 25 ఏడాది కార్యవర్గ సభ్యుల కొనసాగింపు, మార్పులు, చేర్పులతో పాటు గతేడాది జమా ఖర్చులపై చర్చ జరుగుతుందన్నారు. సర్వసభ్య సమావేశానికి సంఘం సభ్యులు విధిగా హాజరు కావాలని వెంకటరాజు కోరారు.

నేరాలు - ఘోరాలు

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - కుక్కునూరు

కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు మండల పరిధిలోని సీతారామనగరం గ్రామ శివారులో సిఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు వారి సిబ్బందితో శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులను, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

అతిగా మద్యం సేవించి భార్యను వేదిస్తున్న భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి ఎం.రాజు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన పరసా వెంకటేశ్వరరావుకు అదే గ్రామానికి చెందిన వెంకటలక్ష్మికి 2015లో కులాంతర ప్రేమ వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో పూర్తిగా మద్యానికి బానిసైన వెంకటేశ్వరరావు రోజూ తాగివచ్చి వేధిస్తున్నాడని, పుట్టింటి నుంచి కట్నం తేవాలని కుటుంబీకులతో కలిసి వేధిస్తున్నాడని, కులం పేరుతో దూషిస్తూ చంపుతామని బెదిరిస్తున్నాడని వెంకటలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీలపై కేసు

ప్రజాశక్తి - కామవరపుకోట

ఒక షాపును షట్టర్ తెరిచి, మరొక షాపును కిటికీ తొలగించి దొంగలు నగదు చోరీ చేసిన సంఘటన గురువారం రాత్రి కామవరపుకోట కొత్తూరులో జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కామవరపుకోట గ్రామానికి చెందిన యన్నంశెట్టి గాంధీబాబు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట సాయిరాం ఆటో మొబైల్ షాప్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం షాపు తెరిచి చూసేసరికి షాపు వెనుక ఉన్న షట్టర్ తెరిచి ఉండటం చూసి షాపులోకి వెళ్లగా షాపులో ఉండాల్సిన రూ.50 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. వడ్లమూడి జగదీష్ సొసైటీ పెట్రోల్ బంక్ ఎదురుగా శ్రీసూర్య ఆగ్రో పురుగు మందుల షాపు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి షాపు మూసి ఇంటికి వెళ్లి, ఉదయం వచ్చి షాపు తెరవగా షాపులో రూ.పది వేల నగదు, సీసీ కెమెరాలు, హార్డ్ డిస్క్ చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. బాధితుల ఫిర్యాదుతో ఈ రెండు ఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.చెన్నారావు తెలిపారు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో తానాలకుంట ఏజెన్సీ చాపరాయికొండ సమీపంలో నాటుసారా తయారీకి సిద్ధం చేసిన నాలుగు వందల లీటర్ల పులిసిన బెల్లపు ఊటను శుక్రవారం దాడి చేసి ధ్వంసం చేసినట్లు పోలవరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ ఆర్.సత్యవతి తెలిపారు. నాటుసారా తయారు చేసినా, అమ్మకాలు జరిపినా కఠిన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

ఏలూరు ఆర్డ్మ్ రిజర్వ్‌డ్ డిఎస్‌పిగా చంద్రశేఖర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు జిల్లా ఆర్డ్మ్ రిజర్వ్‌డ్ డిఎస్‌పి బి.చంద్రశేఖర్ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 మంది ఆర్డ్మ్ రిజర్వ్‌డ్ డిఎస్‌పిలు బదిలీ అయ్యారు. ఈ బదిలీల్లో భాగంగా ప్రస్తుతం ఏలూరు జిల్లా ఎఆర్ డిఎస్‌పిగా పని చేస్తున్న విజి.శ్రీహరిరావు కాకినాడ ఎఆర్ డిఎస్‌పిగా బదిలీ అయ్యారు. కాకినాడ ఎఆర్ డిఎస్‌పిగా పనిచేస్తున్న బి.చంద్రశేఖర్ ఏలూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలి : డిఇఒ

ప్రజాశక్తి - కామవరపుకోట

పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత కలిగి ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. మండలంలోని ఆడమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు అందించే సౌకర్యాలు సరిగ్గా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలోని మరుగుదొడ్ల నిర్వహణ, పరిసరాలు శుభ్రంగా లేని కారణంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి, మధ్యాహ్నం భోజనం పరిశీలించే ఉపాధ్యాయునికి, విద్యార్థుల నోటు పుస్తకాలు దిద్దని ఉపాధ్యాయునికి తాఖీదు ఇచ్చారు.

పాఠశాలలో డిఇఒ తనిఖీలు

ఏలూరు అర్బన్ : కామవరపుకోట మండలంలోని ఆడమిల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల నోట్ బుక్స్‌ను పరిశీలించి, అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని, విద్యార్థుల మరుగు దొడ్లను పరిశీలించారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణ, పరిసరాలు పరిశుభ్రంగా లేని కారణంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుని వివరణ కోరుతూ నోటీస్ ఇచ్చారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఉపాధ్యాయునికి, విద్యార్థుల నోట్ బుక్స్ దిద్దని ఉపాధ్యాయునికి వివరణ ఇవ్వాలని నోటీసు ఇచ్చారు.

గుడిపాడులో డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి - ముసునూరు

ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదుపై నూజివీడు డిఎస్‌పి కెఎన్‌వివి.ప్రసాద్ మండలంలోని గుళ్లపూడి పంచాయతీ శివారు గుడిపాడు గ్రామంలో విచారణ శుక్రవారం చేపట్టారు. ముసునూరు ఎస్ఐ ఎం.చిరంజీవి ఆధ్వర్యంలో ఇరు గ్రూపుల వారిని పిలిపించి విచారణ చేపట్టారు. గతేడాది 2023 జులై నెలలో పొలం గట్ల తేడా విషయంలో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఎస్‌సి ఎస్‌టి కేసు నమోదు చేయగా ఆ కేసు విషయంపై ప్రజల అభిప్రాయాలను తీసుకుని విచారణ చేపట్టినట్లు ఆయన తెలిపారు.

గ్రేడ్-3 ఎఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి మండలంలో సచివాలయాల్లో విధులు నిర్వహించే గ్రేడ్-3 ఎఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని పబ్లిక్ హెల్త్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌టియుసి) నాయకులు బట్టు విజయ్‌వర్ధన్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపిడిఒ పి.శ్రీనివాస్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విజయ్‌వర్ధన్‌బాబు మాట్లాడుతూ గ్రేడ్-3 ఎఎన్‌ఎంలతో వైద్య ఆరోగ్య శాఖకు సంబంధంలేని విధులు అప్పగిస్తున్నారని, దీంతో వైద్య సిబ్బంది విధుల పరంగా మానసిక శారీరక ఒత్తిడులకు గురవుతున్నారన్నారు. విజయ్ వర్ధన్ బాబు ఎం పి డి ఓ శ్రీనివాస్ కి వివరించారు. వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎంపిడిఒ శ్రీనివాస్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-3 ఎఎన్‌ఎంల సంఘ నాయకురాలు పల్లికొండ రాణి, ఎంఎల్‌హెచ్‌పి పావని, ఆశా కార్యకర్తలు దుర్గ, కమురున్నీసా తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నిర్మూలన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

దోమ చాలా ప్రమాదకరమైన కీటకమని దోమల నిర్మూలన పరిసరాల పరిశుభ్రతతో సాధ్యపడుతుందని ఏలూరు జిల్లా మలేరియా అధికారి పిఎస్.ప్రసాద్ సూచించారు. స్థానిక శనివారపుపేట-3 సచివాలయం, శ్రీరామ్‌నగర్‌లో డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువగా వ్యాధులు దోమ కుట్టడం వల్ల సంభవిస్తున్నాయన్నారు. మనకు ఎక్కువగా హాని చేసే దోమలు మన ఇంటి లోపల బయట ఉండే మంచినీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరు వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ఇండెంట్ ఆఫ్ ఫీవర్ సర్వే లార్వా సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్త నాగమణి, ఎంఎల్‌హెచ్‌పి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు అందజేత

ప్రజాశక్తి - కామవరపుకోట

షేర్ అండ్ కేర్ సంస్థ ఆధ్వర్యంలో 15 మంది వృద్ధులకు దుప్పట్లు అందించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు తమ్మిశెట్టి రత్నగిరి మాట్లాడుతూ సంస్థ ద్వారా కోవిడ్ సమయం నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక కార్యక్రమాలు చేపట్టామని, అందులో భాగంగా మండల వ్యాప్తంగా కూడా పలు సహాయ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు షేక్ ఇబ్రహీం, రత్నగిరి తల్లి సీతారావమ్మ, మల్ల రాజు, కొండూరు నరేంద్ర పాల్గొన్నారు.

రాష్ట్ర ముదిరాజ్, ముత్రాసి విభాగం అధ్యక్షుడిగా విష్ణువర్ధన్

ముదినేపల్లి : వైసిపి రాష్ట్ర ముదిరాజ్, ముత్రాసి విభాగం అధ్యక్షుడిగా మండలంలోని చిగురుకోటకు చెందిన కోమటి విష్ణువర్ధన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కోమటి విష్ణువర్ధన్‌ను వైసిపి ముదినేపల్లి నాయకులు శుక్రవారం పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, రాష్ట్ర మాజీ హౌసింగ్ బోర్డు డైరెక్టర్ గంటా సంధ్య, ఈడే వెంకటేశ్వరరావు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ, ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ బత్తిన కిషోర్, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ అల్లాబక్షు, మద్రివాడ సుధాకర్, వైస్ ఎంపిపిలు, చొపర్ల సునీత, రాచురి రాధ, దివి సతీష్, నాయకులు పాల్గొన్నారు.

రోగ నిరోధక శక్తిని పెంచుకోండి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం ద్వారా భవిష్యత్తును కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో వరల్డ్ ఎఎంఆర్ అవేర్‌నెస్ వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రతి మనిషి రోగ నిరోధకశక్తిని పెంచుకోవడం ద్వారా వారి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. అవసరం లేని మందులు వాడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అవసరానికి మించి యాంటీబయోటిక్‌ల వినియోగించకూడదన్నారు. డాక్టర్‌ని సంప్రదించకుండా స్వయంగా మందులు వినియోగించవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎంఎస్.రాజు, డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ట, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్‌కుమార్, ఆర్‌ఎంఒ డి.దుర్గాకుమార్, మైక్రోబయాలజీ హెచ్‌ఒడి శశిధర్, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ సావిత్రి, వైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం షాపు ఏర్పాటు చేయొద్దు

కామవరపుకోట వాసుల ఆవేదన



మాట్లాడుతున్న కామవరపుకోట గ్రామస్తులు

ప్రజాశక్తి - కామవరపుకోట

నూతనంగా కామవరపుకోట చెక్‌పోస్ట్ సెంటర్లో మద్యం షాపు ఏర్పాటు చేస్తున్నారనే సమాచారంతో గ్రామస్తులంతా ఒకటయ్యారు. కామవరపుకోటలో చెక్‌పోస్ట్ సెంటర్‌లో కనకదుర్గమ్మ ఆలయంలో పాటు అటు జంగారెడ్డి గూడెం ఇటు చింతలపూడి, సత్తుపల్లి ప్రాంతాలకు వెళ్లే బస్సులు ఇతర వాహనాలతో ప్రతిక్షణం వాహనదారులతో రద్దీగా ఉంటుంది. పలువురు మాట్లాడుతూ ప్రధాన రహదారికి 110 మీటర్ల దూరంలో మద్యం షాపులు ఏర్పాటు చేయాలన్నారు. షాపు ఏర్పాటు నిర్ణయాన్ని మార్చుకోకపోతే అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, దశలవారీగా ఉద్యమానికి కూడా సిద్ధమని గ్రామస్తులు కాకి సురేష్‌కుమార్, టివిఎస్.రాజు, నానాది సాగర్, అయితం మహేష్, బండారు ప్రసాద్, కొవ్వూరి భాగ్యరాజ్, చక్రహరి కనకరాజు, తోకల రాజేష్, వంటిపల్లి విజయ్‌కృష్ణ, ఆకుల అప్పారావు, చైతన్య, వీరమల్ల మధు, నండూరి భాను, మణికంఠ తెలిపారు.

26న కలెక్టరేట్ వద్ద ప్రజాధర్నా జయప్రదానికి పిలుపు



నిడమర్రులో...

ప్రజాశక్తి - నిడమర్రు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని ఈ నెల 26వ తేదీన జరిగే ప్రజాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు పిలుపునిచ్చారు. సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అడవికొలను, భువనపల్లి, ఎనికేపల్లి, శ్రీరామపురం, చానమిల్లి గ్రామాల్లో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నారపల్లి రమణారావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని, కార్మిక హక్కులు కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ఉపాధి హామీ చట్టంలో రోజుకు రూ.600 వేతనంతో రెండు వందల రోజులకు పని దినాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన్, కానూరు రాజు, లావేటి సోంబాబు పాల్గొన్నారు.

పోలవరం : ఈ నెల 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జరగనున్న మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎపి రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బాషా పిలుపునిచ్చారు. పోలవరం మండల కేంద్రంలో ఉభయ సంఘాల సభ్యులతో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగ బాషా మాట్లాడుతూ కూలీల, శ్రామికుల సమస్యల పరిష్కారానికి సంయుక్త కిసాన్ మోర్చా అఖిల భారత కార్మిక సంఘాల సమన్వయసమితి అఖిల భారత పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం మహాధర్నా కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. ప్రగడపల్లి, రేపల్లెవాడ, వెంకటరెడ్డిగూడెం, గుంజవరం, రామన్నపాలెం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు, మిడియం రవిదొర, మడకం పోశమ్మ పాల్గొన్నారు.

ఏలూరును పారిశ్రామికవాడగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు జిల్లాను పారిశ్రామికవాడగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తాను పనిచేస్తున్నానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తెలిపారు. ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు ఎప్పుడు ప్రారంభించి ఎప్పటిలోగా పూర్తి చేసేది సిఎం చంద్రబాబు స్వయంగా ప్రకటిస్తారని చెప్పారు. ఏలూరు శాంతినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం టిడిపి శాశ్వత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ వచ్చే వారంలో సిఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు రానున్నారని తెలిపారు. అధికారులు, తాను ఎప్పుడూ పర్యటనకు వెళ్లినా పోలవరం నిర్వాసితుల నుంచి అర్జీలు వెల్లువెత్తుతున్నాయన్నారు. పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అనంతరం జిల్లా కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి పోలవరం నిర్వాసితులకు ఎలాంటి ప్రయోజనాలు చేకూర్చాలనే విషయంపై ప్రణాళిక సిద్ధం చేస్తారని తెలిపారు. ఆయుధ కర్మాగారం జీలుగుమిల్లి మండలంలోనే ఏర్పాటు చేస్తున్నామని, దీనికి అన్ని రాజకీయ పార్టీలతో పాటు ప్రజలు తమకు పూర్తిగా సహకారం అందించాలని కోరారు. జిల్లా కేంద్రమైన ఏలూరులో ట్రేడింగ్‌కు సంబంధించిన పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులు ముందుకు వచ్చారని, జనవరి లేదా ఫిబ్రవరి నెలలో పరిశ్రమ పనులు ప్రారంభించడానికి శంకుస్థాపన చేస్తామని చెప్పారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో నిలిచిన పంచాయతీ భవనాలను త్వరగా పూర్తి చేయడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం 20 మంది టిడిపి నాయకులు రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కుక్కునూరు : టిడిపి కుక్కునూరు మండలాధ్యక్షులు మొలిశెట్టి నాగేశ్వరరావు రూ.లక్ష కట్టి టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో ఆయన శుక్రవారం రూ.లక్ష కట్టి సభ్యత్వం తీసుకున్నారు. ఆయనతో పాటు చుంచు సత్యనారాయణ, పిచ్చుకల రాజు, అల్లాడి సురేష్ ఉన్నారు.

గోనెసంచుల నాణ్యతను పున:పరిశీలించాలి

పౌరసరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మన్జిర్ జిలాని సమూన్

ప్రజాశక్తి - భీమడోలు

ధాన్యం సేకరణ కోసం ప్రత్యేకించిన గోనె సంచుల నాణ్యతను అవసరం మేరకు జిల్లా వ్యాప్తంగా పున:పరిశీలించాలని పౌరసరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మన్జిర్ జిలాని సమూన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన భీమడోలు మండలంలో పర్యటించారు. పర్యటనలో సంయుక్త కలెక్టర్ ధాత్రిరెడ్డితో పాటు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు. వీరికి అదనంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు చెందిన జిల్లా సహకార అధికారి ఎ.శ్రీనివాస్ హాజరయ్యారు. తొలుత పౌర సరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పాతూరు గ్రామం వద్ద ఉన్న పౌరసరఫరాల సంస్థకు చెందిన మండల స్థాయి స్టాక్ పాయింట్‌ను సందర్శించారు. వివిధ అంశాలను పరిశీలించి, తనిఖీలను నిర్వహించారు. అనంతరం పొలసానిపల్లి గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రానికి చేరుకున్నారు. వీరికి వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు ఉషా రాజకుమారి, వ్యవసాయ అధికారి ఉషారాణి స్వాగతం పలికారు. ఎస్‌పిఒ ఆధ్వర్యంలో అక్కడ నిర్వహిస్తున్న ధాన్యం సేకరణ కేంద్రం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణకు ప్రత్యేకించి సిద్ధం చేసిన గోనెసంచులను పరిశీలించారు. వాటిలో కొన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడం గమనించారు. అనంతరం రైతులతో ఆయన మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో భీమడోలు తహశీల్దార్ బి.రమాదేవి పాల్గొన్నారు.

పలుచోట్ల 'పోషణవాటిక'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఐసిడిఎస్ పోషణ వాటిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏలూరు 16వ డివిజన్‌లోని 110 అంగన్వాడీ కేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిడిపిఒ ఎ.పద్మావతి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను ఆహ్లాదకరంగా మార్చాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. పోషణ వాటిక కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మీనాక్షి, ఇతర అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : ఏలూరు ప్రాజెక్టు పరిధిలోని తంగెళ్లమూడి ఎంపిపి స్కూల్ ఆవరణలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు యాదవనగర్, వెంకటరావుపేట, ముస్లిం బజార్ కేంద్రాలను, విమలాదేవి స్కూల్, నవయుగ స్కూల్స్‌ను ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కెవిఎల్.పద్మావతి శుక్రవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోషణ వాటిక అనే కార్యక్రమం విశిష్టతను అంగన్వాడీ వర్కర్లకు వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ఆవరణలో సపోటా, జామ, మామిడి తదితర మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ పద్మావతి, సెక్టార్ సూపర్‌వైజర్ బి.మంగ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి చెరువులో చేపలు మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరు పంచాయతీ మంచినీటి చెరువులో చేపలు చనిపోవటంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. శుక్ర వారం చెరువులో చేపలు చనిపోయి నీటిపై తేలటంతో ప్రజలు ఒకింత ఆందోళన చెందారు. నీరు కలుషితంగా మారి చేపలు చనిపోయాయా, లేక ఆక్సిజన్ అందక చనిపోయాయా అన్న విషయంపై సందిగ్ధత నెలకొంది. గ్రామంలో ఉన్న మంచినీటి చెరువులో మాత్రమే ఇలా చేపలు చనిపోయాయి. మంచినీటి చెరువులో చేపలు చనిపోవటం కొంత చర్చనీయాంశంగా మారింది. చనిపోయిన చేపలను తొలగించే కార్యక్రమం గ్రామపంచాయతీ సిబ్బంది చేపట్టారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

చింతలపూడి : నామవరం పంచాయతీ అభివృద్ధికి ఎప్పుడూ కృషి చేస్తానని, టిడిపి నామవరం పంచాయతీ నాయకులు సూరినేని గోపీ అన్నారు. మండలం లోని పట్టాయగూడెంలో గోద్రేజ్ ఆయిల్ పామ్, రాజు వేగేశ్న ఫౌండేషన్ సౌజన్యంతో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. మినరల్ వాటర్ ప్లాంట్ భవనానికి ఐదు సెంట్ల భూమిని విరాళంగా ఇచ్చారు. ఐదుగురు పేద విద్యార్థులకు స్కాలర్ షిప్ చెక్కులను గోద్రేజ్ కంపెనీ సిఇఒ సౌగత నియోగి పంపిణీ చేశారు.